
# సినీ బేతాళ కథలు





– డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 24 -

### ఆమోదితం

**విక్రమార్కుడు** యీసారి బేతాళుడి శవాన్ని బ్లాకయిపోయిన బ్లాక్‌మనీ బస్తాలా తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు.

"విక్రా! నీకు శ్రమ తేలికయ్యే ప్రయత్నంగా మళ్లీ మరో కథ చెబుతాను విను!" - అని బేతాళుడు చెప్పడం ప్రారంభించాడు.

"- ఆ మధ్య గంగులు బాబా అనే నిర్మాత దర్శకుడు వైట్ మనీలాంటి చిన్న టైట్ టీ షర్టు వేసుకుని, బ్లాక్ మనీలాంటి దాచిదాచి తీసిన వొక నల్ల ట్రౌజరేసుకుని, ఆంధ్రదేశంలో వొక వూళ్లో రోడ్డు మీద వొక కిళ్లీ కొట్టు దగ్గర నిలబడ్డాడు. అతనికి పది పన్నెండు గజాల దూరంలో రిక్షా స్టాండులో ఓ అరడజను సైకిల్ రిక్షాలున్నాయి. వాటిలో వొక రిక్షా బాగా పాతబడిపోయి అవకతవగ్గా వుంది. టాపంతా చిరిగి కన్నాలు పడిపోతే పాత వెయ్యి, అయిదొందల నోట్లు అస్తవ్యస్తంగా ఆ కన్నాలకు అతికించుకున్నాడు ఆ రిక్షుడు.

గంగులు బాబా "రిక్షా!" అని పిలవగానే అన్ని రిక్షాలు కదలబోయాయి. కానీ గంగులు బాబా, 'అందరూ ఎందుకయ్యా! అతనొక్కడూ చాలు' అని, బ్రతికి చెడిన ఆ పాత రోత రిక్షాని పిలిచి, యెక్కి కూర్చుని, "పోనీ!" అన్నాడు. రిక్షుడు పరమానందభరితుడై, "ఎక్కడికెళ్లాలండి?" అనడిగాడు.

"అదుగో ఆ కిరానా కొట్టుదాకా పోనియ్!" అని తను యెక్కిన చోట వున్న కిళ్లీ కొట్టుకి ఒక నలభై గజాల దూరంలో వున్న కిరాణా కొట్టు చూపించాడు గంగులు బాబా.

"యీ కుసింత దూరం నడిచేసే పనండి - రిచ్చా యెందుకు సార్ - యేస్టు" అన్నాడు రిక్షుడు.

"నీకు యేస్టు లేకుండా నేను సూత్తాలే - వర్రీ అయి అర్రీ బుర్రీగా తొక్కక. బేరం మీద మవకారం మాని నా సేమం కోరావ్ - మంచోల్లా గున్నావ్.. ఏటి నీ పేరు? " అడిగాడు గంగులు బాబా.

"డింగరి బాబండి."

"డింగరి?"

"మరేనండి. మా బాబుకి పాతాలబయిరవి పేనం అండి. నానప్పుడే పుట్టానండి."

"బలే డింగరీ - బలే - నిన్ను డింగరీ అని పిలుత్తూంటే నేను యస్వీ ఆరులా ఫీలింగ్గై పోతున్నాను."

"బాగా సెప్పారండి. పేచ్చకుడికి నచ్చితే సినిమా ఆడుద్దండి. పాసింజరు యాపిస్ అయితే గిరాకీ కిట్టుద్దండి -, కిరాణా కొట్టొచ్చేసిందండి. దిగుతారా బాబూ!`"

"దిగను - యెనక్కి తిప్పి మల్లా ఆ కిల్లీ కొట్టుకాడికి తీసుకెల్లు."

"అక్కడేటన్నా పర్గెట్సండీ?"

"నో పర్గెట్స్ డింగరీ - యెనక్కి తీసుకెల్లు సెప్తా!"

డింగరి మళ్లీ గంగులు బాబాని బైల్దేరిన చోటికి తీసుకొచ్చాడు.

"యిప్పుడు మల్లా ఆ కిరానా సాపుకి తొక్కు డింగరీ"

"సిత్తం గురో" అని డింగరి మళ్లీ గంగులుబాబాని కిరాణా కొట్టు దగ్గరికి తొక్కుకొచ్చాడు.

"ఇప్పుడు మల్లా ఆ కిల్లీ సాపుకి తొక్కు"

బదులు చెప్పకుండా రిక్షా తొక్కుతున్నాడు కానీ అతనికి గంగులుబాబా అర్థం కాక డింగరి బుర్ర బొంగరంలా తిరగసాగింది.

"అరే డింగరీ! మల్లా ఆ కిరానా సాపుకి తొక్కు"

"సిత్తం దొరా!"

"మల్లా ఆ కిల్లీ సాపుకాడకి"

"సిత్తం గురువా!"

"ఆ కిరానాకి"

"సిత్తం గురువా!"

"కిల్లీ డింగరీ"

"సిత్తం గురో"

"డింగరీ కిరానా"

"సిత్తం గురో!"

ఈలోగా మీద మబ్బులు కరుగుతూ చినుకులు మెదలయ్యాయి. డింగరి రిక్షా ఆపి టాపు సరిచేస్తూ అన్నాడు. "యీ పాతనోట్లు పనికిరావండి. సిల్లులు కాయలేక సిరిగిపోతన్నాయ్ - తవరా తడిసిపోతున్నారు."

"నో పాల్బం! పోనీ ఆ కిల్లీ కొట్టుకాడికి."

"సిత్తం గురో!" అని రిక్షా తొక్కుతూ డింగరి అడిగాడు. "బాబూ - యిన్ని టిరిప్పులేస్తున్నా - దేవున్ని మోతన్నట్టే వుందిగానీ అలుపు లేదు. తవరెవరో తెలుసుకోవాలని కోరిక - యావనుకొమాకండి."

"ఏవీ అనుకోను - డింగరీ - ఏమీ అనుకోను. విను. నాపేరు గంగులు బాబా! నేనొక సినేమా నిర్మాతను, నా సినేమాలకి నేనే దర్శకుండ. నా సినేమాలు జనాలు సూత్తారు. అడపాదడపా నేనొక్కన్నే సూసుకుంటా - జనం లేక కాదు, రాక, రాక డింగరీ రాక."

"అదా యిసయం గంగులుబాబుగారూ! అయితే నానూ నిరమాతనే దొరా! సినిమా లెయ్యా తీలేదు."

"సినిమాలు తీకుండా నిర్మాతవెలాగవుతావ్ డింగరీ!"

"అదేనండి మరి. సిన్నప్పుడే నాకు తల్లిపోయిందండి. అందుకే మాత కాని నిర్మాతని"

"ఆమ్ చారీ డింగరీ - చారీ సారీ! కానీ నివ్వెంత గొప్పోడివో, నీ యీ రిచ్చా యెంత పేమసో నీకు తెల్దు. నే సెప్తా యిను, నేనీమద్దె నా కొత్త సినేమా మొదలెట్టా. బారీగా తీద్దావని బారతకత పెసల్‌గా రాయించుకున్నా. అనుకోకుండా పరిత్తితులు బెడిసికొట్టాయి. అయినా పొడచ్చనాపదల్సుకోలేదు. ఎక్‌పెనిసివు సెట్లూ, గరాపిక్కులూ కాదనుకుని బ్లాకైన పాత నోట్లన్నీ నానేసి రుబ్బించి దుర్యోదనుడి కోట కట్టించా. కత్తులూ, కటార్లూ, కవసాలూ, కాస్టూవులూ యివన్నీ బ్లాకు నోట్ల పిండితో చేసేయించా. కురుచ్చేత్ర యుద్దానికి యేలమంది కౌరవ కొడుకుల్నీ పాండవ మిల్ట్రీని బుక్ సేయింసేశా. తీరా సూటింగు రోజు సూటింగు మొదలెడదావంటే యెవడూ రాలేదు. యుద్దానికి ముందే లోకేసనంతా శవాల్ని పూడిచేసిన స్మసానంలా వుంది. ఒక్క యిదురుడూ, సవదేవుడూ మాత్రం సూటింగొచ్చారు. ఆర్టిట్టులంతా యెక్కడ సచ్చారనడిగితే పాతనోట్లు మార్సుకోడానికి బ్యాంకులకి పొయ్యేరట. మరి మీరిద్దరి యిసయం యేటని యిదురుడిగాన్నీ సవదేవుడిగాన్నీ అడిగితే ఆల్లిద్దరూ తెల్లార కట్ట లెగిసి యెల్లి ఆల్లదగ్గరున్న సిల్లర నోట్లు ఆల్రెడీ మారుసేసుకున్నాం అన్నారు. నా కొ పొడ్డూసరుగాడు కూడా గైరాజరయిపోయాడు. ఏం పాలుపోలేదు. అయినా అద్దైర్యం అరిస్టవని ఆలోసించి ఆలోసించి అనుకున్న సినేమా ఆపేసి మాంచి కలాతమకంగా కచ్చితమైన సినేమా సెయ్యాలనుకున్నా.

కానీ డింగరీ! మనకంత మెదడు లేదుగా మరి. ఏం సెయ్యాలా అని ఆలోసిత్తా అక్కడా యిక్కడా డిస్సుకసన్లు సేశాక తెలిసింది. ఈ వూళ్లో నీ రిచ్చా ఒకటుందనీ, బాగా వోల్డయినా, గోల్డులాటిదనీ, శాంతో రామూ, సత్రాజిత్తురే యీ రిచ్చానే యెక్కేవోరనీయని, నీ రిచ్చాలో బాగా కూకుంటే బుర్ర మెరుగై కలాతమకాలు తియ్యగలనని దీమా వొచ్చేసింది. అందుకే యిన్నిసార్లు నీ రిచ్చాలో కూచుని అటూ యిటూ తొక్కమన్నా - డింగరీ! ఏవనుకోబోక - నా తదుపరి సిత్తరానికి నువ్వే దర్శకుడివి" అని ఆయాసపడి ఆగాడు గంగులు బాబా.

"డవిరెక్సనా! నాకు తెల్దేమరి! " అన్నాడు డింగరిబాబు.

"అదే కదా మన తెలుగు సిత్రానికి పేణం. రిచ్చాతొక్కినట్టు జాయిగా పేచ్చకొడుకుని తొక్కేడవే" అని ధైర్యం పోసాడు గంగులుబాబా.

డింగరి బాబు ఆలోచించి అన్నాడు.

"సూడండి, గంగులుబాబూ! కోపం తెచ్చుకోమాకండి. బ్లాక్ అండ్ వెయిట్ రోజులు పోయాయి. అంటే కొంత బ్లాకులోను, కొంత వెయిట్‌లోనూ కర్సెట్టి తీసే సినేమాలు. అంచాత యెవరేనా డబ్బు ముడుపెట్టేవోల్లని యెతుకుదాం - అన్నట్టు - యిన్నాల్లు పోసించారు గదా మీ కవిగారు, కెమేరావోడు, పాటలు కట్టేవోడు, మీ కో నిరుమాత - యీల్లంతా తలో సెయ్యీ యేత్తే అంతా సెబాసే. ముందాల్లనట్టుకుందాం."

"అరే డింగరీ! ఆల్లంతా యిప్పుడు తలో సోటా సెటిలయిపోయారు. మనకందరు. మా కవిగాడు స్టేట్‌బాంకులో, మా కెమెరామన్ ఐసిఐసిఐ బాంకు, మా మూజిక్కోడు కెనరాబాంకు, నా శవ నిర్మాత గోదావరి బాంకు -"

"బలే దొరా బలే, ఆల్లంతా బాంకులే - మన తదుపరి కలాతమకమనే సిత్రానికి అంతా వొయిటే - వొద్దంటే డబ్బు." అని ఆనందోద్వేగాల్తో వూగిపోయాడు డింగరి బాబు.

- అని కథ ముగించి బేతాళుడు, "ఇప్పుడు చెప్పు విక్రా! గంగులు బాబాకి అతడి పాత క్రూ ధన సహాయం చేశారా? డింగరి బాబుతో అతను కళాత్మక చిత్రం తియ్యగలిగాడా? ఈ పశ్నలకు నువ్వు తెలిసే సమాధానం చెప్పకపోయావో నీ తల పాత వెయ్యి రూపాయల బ్లాకు నోటులా పనికిరాకుండా పోతుంది." అని ఫినిషింగిచ్చాడు.

- "ఓ బేతాళా! గంగులు బాబా సమాచారన్ని డింగరి బాబు అపార్థం చేసుకున్నాడు. గంగులు పాత క్రూ అయిన కవి, కెమెరామన్, మ్యూజిక్ డైరెక్టర్ - ఆయా బ్యాంకుల్లో 'క్యూ'స్‌లో నిలబడి తమ పాతనోట్లు మార్చుకునే ప్రయత్నంలో వున్నారు. ఇక

గంగులు బాబా సహనిర్మాత మేట్లు వేసిన తన కోట్ల బ్లాక్ మనీని యేం చేసుకోవాలో తెలీక గోదావరి బ్యాంకు అంటే గోదవరి వొడ్డున నిలబడి గోదాట్లో దూకాలా మానాలా అనే కన్ఫ్యూజన్‌లో వున్నాడు.

ఈ నిజం తెలిసిన గంగులు బాబా రిక్షాలో కూర్చుని టాపు చిరుగుల్లోంచి కురిసే వానలో తడిసిపోతున్నాడు. 'వానలో తడిపోతున్నారు గురువా! అన్న డింగరి బాబుతో - 'నాకీ వాన చాలా యిట్టం - ఎందుకంటే నా ఏడుపు ఎవడికీ తెల్దు' - అన్నాడు.

- 'జితాత్మనఃప్రశాన్తస్య

పరమాత్మా సమాహితః|

శీతోష్ణ సుఖదుఃఖేషు

తధామానానమానయోః||

శీతోష్ణ సుఖదుఃఖాది ద్వందములకు వికారమును చెందక బాహ్యేంద్రియములనరికట్టు వానికి మనస్సునందు ప్రత్యగాత్మ నిజ రూపముతో స్పష్టముగా అనుసంధింపబడును - అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణభగవానుడు" -

అని విక్రమార్కుడు బదులు చెప్పగానే, రాజుకి మౌనభంగం కలిగి బేతాళుడు ఎగిరి బ్లాకుమనీతో అర్జంటుగా కొన్న బంగారంలాంటి చెట్టెక్కేసాడు.

*(వచ్చేనెలలో మరోకథ)*

Post your comments